నవంబర్ 30న అగ్గి రగలాలి

- ఆ కీలల్లో బీజేపీ, కాంగ్రెస్ దహించుకుపోవాలి
- నాడు అల్గునూర్ చౌరస్తాలో అంటుకున్న అగ్గి.. తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు సాగింది
- అదే స్ఫూర్తితో కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేద్దాం
- వచ్చే ఆరు నెలల్లో కేసీఆర్ బీమా
- కరీంనగర్ ప్రజాఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్
- గంగులకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని విజ్ఞప్తి

కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ తదితరులు

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో మరోసారి అగ్గి రగిలించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు ప్రజలను కోరారు. బుధవారం కరీంనగర్‌లోని జరిగిన ప్రజాఆశీర్వాద సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాడు కేసీఆర్ నిరాహార దీక్ష కరీంనగర్‌లో ప్రారంభిస్తే, అల్గునూరు చౌరస్తాలో అరెస్టు చేయటంతో అగ్గి రాజుకున్నదని, ఆ అగ్గి తెలంగాణ సాధించేవరకు సాగిందని వెల్లడించారు. మళ్లీ ఇప్పుడు మరోసారి అగ్గి రగిలించాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. ఓట్ల అగ్గి కీలల్లో బీజేపీ, కాంగ్రెస్ దహించుకుపోవాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీలకు ఓటేస్తే కష్టపడి సాధించుకున్న తెలంగాణ మరో 50 ఏండ్లు వెనక్కి వెళ్తుందని చెప్పారు. గత తొమ్మిది దినరేండ్లలో అభివృద్ధి పనులు ఎలా జరిగాయో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోనే కాదు, కరీంనగర్‌లో వచ్చిన మార్పు ప్రజల కండ్ల ముందే ఉన్నదని, రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు, సాగు, తాగునీరు వంటి సమస్యలు పరిష్కారం అయ్యాయని వివరించారు. కాళేశ్వరంతో మిడ్‌మానేరు, లోయర్ మానేరు, అప్పర్‌మానేరు ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయని తెలిపారు.

> కేసీఆర్ హిందువు. ఏనాడు మతాన్ని, ధర్మాన్ని దాచుకోలేదు. ప్రధాని మోదీ సైతం చేయని చండీయాగం చేసి హిందువునని అని గర్వంగా చెప్పుకున్నారు. కానీ, ఏనాడైనా మతం పేరుతో రాజకీయాలు చేశారా? కేసీఆర్ ఏ ఒక్క వర్గానికో మతానికో సీఎం కాదు. సబ్బండ వర్గాలు, కులాలకు నాయకుడు.
> - మంత్రి కేటీఆర్

తొమ్మిదిన్నరేండ్లలో 2.20 లక్షల ఉద్యోగాల భర్తీకి కేసీఆర్ సర్కారు శ్రీకారం చుట్టింది. అందులో 1.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మిగిలిన పోస్టులూ భర్తీ చేస్తాం. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. అవసరమైతే టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేస్తాం.
- మంత్రి కేటీఆర్

ఆరు నెలల్లో కేసీఆర్ బీమా

'మంత్రి గంగుల కమలాకర్ స్వయంగా ఆలోచన చేసి సీఎం కేసీఆర్‌కు ఓ మాట చెప్పారు. రాష్ట్రాన్ని మీ నాయకత్వంలో అన్న పూర్ణగా చేశారు. దేశానికే అన్నం పెట్టే తెలంగాణలో మన బిడ్డలకు కడుపు నిండా సన్నబియ్యంతో బువ్వ పెడుదాం' అని గంగుల చెప్తేనే అన్నపూర్ణ అనే కొత్త పథకాన్ని సీఎం తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా కేసీఆర్ బీమా- ప్రతి ఇంటికి ధీమా అనే కొత్త పథకాన్ని కేసీఆర్ తీసుకొస్తున్నారని, దీంతో 93 లక్షల తెల్ల కార్డుదారులకు ప్రభుత్వమే బీమా కల్పించనున్నదని వివరించారు. ప్రజలు ఆశీర్వదించి మరో అవకాశం ఇస్తే ఆరు నెలల్లో బీమాను ప్రారంభం చేస్తామని ప్రకటించారు.

మసీదులు తవ్వాలా? అభివృద్ధి కోసం పునాదులు తవ్వాలా?

మత రాజకీయాలు చేసేవాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రి కేటీఆర్ అన్నారు. మతం పేరుతో ఓట్లు అడిగితే చెంపపెట్టులాంటి తీర్పు ఇవ్వాలని తెలిపారు. ఎంపీ అయినప్పటి నుంచి బండి సంజయ్ కరీంనగర్‌కు ఒక్క పైసా పనైనా చేశారా? అని నిలదీశారు. మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమారే టీటీడీ బోర్డు వద్దకు వెళ్లి, వారిని ఒప్పించి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. కొంతమంది చిల్లర రాజకీయం కోసం ప్రవళిక ఆత్మహత్యను రాజకీయం చేశారని మండిపడ్డారు. 'బుధవారం అమ్మాయి తల్లిదండ్రులు, తమ్ముడు నా వద్దకు వచ్చి అన్నా.. మా బిడ్డకు అన్యాయం జరిగింది. ఒకాయన వేధించి చంపిండు. న్యాయం చేయాలి అని కోరారు. వాళ్లకు ఒక్కటే హామీ ఇచ్చిన. మీరు బాధ పడకండి. మీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. తమ్ముడికి ఉద్యోగం ఇప్పిస్తా. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటాం' అని చెప్పానని వివరించారు.

గంగులపై ప్రశంసల జల్లు

అందరి అభిమాన నాయకుడు, కాబోయే ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అని కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. తొమ్మిదిన్నరేండ్లలో కరీంనగర్‌ను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత సుందరంగా తీర్చిదిద్దుతారని వెల్లడించారు. గంగులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కమలాకర్‌పై పోటీ చేయడమంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసి నట్టేనని భయపడి పారిపోతున్నారని కాంగ్రెస్,

> మసీదులు తవ్వుదాం.. శవం వస్తే మీది.. శివం వస్తే మాది అంటూ రెచ్చగొడుతున్నారు. ఎంపీగా గెలిపించింది మసీదులు తవ్వేందుకేనా? ఎంపీ, ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత తవ్వాల్సింది మసీదులు కాదు. అభివృద్ధి పనుల కోసం పునాదులు.
> - మంత్రి కేటీఆర్

బీజేపీ నేతలను ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. చొప్పదండి, మానకొండూరు ఎమ్మెల్యేలుగా సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

> చావు నోట్లో తల పెట్టి కరీంనగర్‌లో నిరాహార దీక్ష చేపట్టి ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ తెచ్చి తొమ్మిదిన్నరేండ్లలోనే రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా చేసిన నాయకుడు కేసీఆర్ ఒక వైపు. ఉద్యమ సమయంలో రాజీనామా చేయమంటే అమెరికా పారిపోయిన కిషన్‌రెడ్డి. ఓటు నోటు కేసులో దొరికిన దొంగ టీపీసీసీ అధ్యక్షుడు మరోవైపు ఉన్నారు. వాళ్లకు ఓటేద్దామా? తండ్రిలాంటి కేసీఆర్ చేతికి రాష్ట్రాన్ని ఇద్దామా?
> - మంత్రి కేటీఆర్

రాష్ట్రాన్ని ఢిల్లీ చేతిలో పెట్టొద్దు: గంగుల

రాష్ట్రాన్ని ఢిల్లీ పాలకుల చేతిలో పెడితే కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రగతి ఆగిపోతుందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ ఏర్పడితే కరెంటు లేక అంధకారం అవుతుందని చెప్పిన కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీ ముసుగులో హైదరాబాద్‌లో తిష్ట వేశారని, తెలంగాణ ఏర్పాటును పచ్చిగా వ్యతిరేకించిన వైఎస్ షర్మిల ఇప్పుడు ఈ గడ్డ మీద నిలబడ్డారని తెలిపారు. ప్రజల్లో ఎవరున్నారో, ఎవరు ఏం చేస్తున్నారో గమనించాలని ప్రజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న పార్టీలు రాష్ట్రానికి ఏం చేశాయి? తొమ్మిన్నరేండ్ల బీఆర్ఎస్ ఏం చేసింది? అన్న చర్చ జరగాలని అన్నారు.

బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభకు భారీగా హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

మాట్ల తిరుపతి రాసిన 'మన బాపు కేసీఆర్' పాట సీడీని బుధవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఉక్కు గుండెనొక్కసారన్నా తాకాలని..

- కేక పుట్టిస్తున్న కేసీఆర్‌పై ట్రెండ్ సెట్టింగ్ సాంగ్
- మాట్ల తిరుపతి పాటను విడుదల చేసిన మంత్రి కేటీఆర్
- ఇప్పటికే జనం నోళ్లలో నానుతున్న 'గులాబీల జెండలే రామక్క' పాట

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్‌పై రూపొందిన కొత్త పాటలు జనం హృదయాలను కదిలిస్తున్నాయి. 'గులాబీల జెండలే రామక్క' పేరుతో ఇటీవలే వచ్చిన కొమ్ము లక్ష్మమ్మ పాట ఇప్పటికే ప్రజల నోళ్లలో నానుతున్నది. ఈ పాటను ఎన్నికల సభల్లో కళాకారులు పాడుతుంటే సభకు వచ్చిన జనం స్వరం కలుపుతూ సందడి చేస్తున్నారు. తాజాగా కేసీఆర్‌పై విడుదలైన మరో పాట ప్రజల్లో ఆలోచనను రగిలిస్తున్నది. 'ఉక్కు గుండెనొక్కసారన్నా తాకాలని ఉన్నదే.. ఆ బక్కపల్చని పెయ్యిని హత్తుకోవాలని ఉన్నదే' అని కళాకారుడు మాట్ల తిరుపతి రాసిన 'మన బాపు కేసీఆర్' పాట ఆడియో విజువల్ సీడీని బుధవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఉద్యమ రథసారథి కేసీఆర్ త్యాగాలను ఈ పాట గుర్తు చేస్తున్నదని కేటీఆర్ కొనియాడారు. స్వయం పాలనలో సీఎంగా కేసీఆర్ ఔన్నత్యాన్ని చాటుతుందని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో కొలువై ఉన్నాడన్న భావనను పాటలో తిరుపతి వ్యక్తీకరించారని పేర్కొన్నారు. ఈ పాట సమర్పకుడైన ఎంపీ సంతోష్‌కుమార్‌ను, నిర్మాత ఎస్ రాఘవ, డైరెక్టర్ పూర్ణను కేటీఆర్ అభినందించారు. 'మన బాపు కేసీఆర్' పాట అద్భుతంగా ఉన్నదని మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ కొనియాడారు. రచయిత తిరుపతికి అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ రాసిన ఈ పాట చాలా ఉత్తేజం నింపుతుందని ఎంపీ సంతోష్‌కుమార్ కొనియాడారు. ఈ సాంగ్ వింటే గూస్‌బంప్స్ తప్పవని, ఇది కేవలం మ్యూజిక్ మాత్రమే కాదని, ఇది వారసత్వ జర్నీ అని పేర్కొంటూ తన సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేశారు.

ప్రవళిక సోదరుడికి ఉద్యోగం

- ఆమె మృతికి కారణమైన వ్యక్తికి కఠిన శిక్షపడేలా చూస్తాం
- ప్రవళిక కుటుంబసభ్యులతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన వరంగల్ జిల్లా బిక్కాజీపల్లికి చెందిన మౌరి ప్రవళిక కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని పురపాలక, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రవళిక మృతికి కారణమైన వ్యక్తికి తప్పకుండా తగిన శిక్ష పడేలా చూస్తామని, ఆమె సోదరుడికి ఉద్యోగం ఇప్పిస్తానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. ప్రవళిక తల్లిదండ్రులకు, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుధవారం ప్రవళిక కుటుంబసభ్యులు కేటీఆర్‌ను కలిసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని, తన కూతురు మరణానికి కారణమైన శివరామ్‌ను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారిని ఓదార్చి భరోసా ఇచ్చారు. ప్రవళిక మరణం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా దురదృష్టకరమని, ఇటువంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలని చెప్పారు. ప్రవళిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. కేసు పురోగతిపై డీజీపీతో మాట్లాడి విచారణ వేగవంతం చేయాలని సూచించారు. తన కూతురు మరణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి తమ కడుపుకోతను చల్లారుస్తామని కేటీఆర్ భరోసా కల్పించారని ప్రవళిక కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నుంచి బీఫామ్ అందుకుంటున్న మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

గులాబీ జెండా ఎగురవేస్తాం..

- మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి

మల్కాజిగిరి, అక్టోబర్ 18: మల్కాజిగిరి నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్‌ను ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ తనపై నమ్మకంతో టికెట్ ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి, సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.

103 మంది బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫారాలు

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ నేటి వరకు మొత్తంగా 103 మంది బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బీఫారాలను అందజేశారు. బుధవారం గంగుల కమలాకర్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీ లక్ష్మారెడ్డి, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, సుంకె రవిశంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి బీఫారాలను అందుకున్నారు.

ఇద్దరు హైకోర్టు జడ్జిల బదిలీ

- దేశవ్యాప్తంగా 17 మంది ట్రాన్స్‌ఫర్

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లో పని చేస్తున్న 17 మంది న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో తెలంగాణ హైకోర్టుకు చెందిన ఇద్దరు, ఏపీ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు ఉన్నారు. సుప్రీంకోర్టు కొలీజియం గతంలో చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసినట్టు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా బుధవారం ప్రకటించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్నూరి లక్ష్మణ్ రాజస్థాన్‌కు, జస్టిస్ జీ అనుపమ చక్రవర్తి పాట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీ మానవేంద్రనాథ్ రాయ్ గుజరాత్‌కు, అదనపు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణను మధ్యప్రదేశ్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్రజీ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఏపీ హైకోర్టుకు న్యాయవాదుల కోటా నుంచి హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి కనపర్తి, సుమతి జగదం, న్యాపతి విజయ్ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వీరితో శుక్రవారం ఆ రాష్ట్ర సీజే ప్రమాణస్వీకారం చేయించనున్నారు. కాగా, రాష్ట్ర హైకోర్టులో సీజేతో కలిపి 42 మంది న్యాయమూర్తుల పోస్టులకు ప్రస్తుతం 30 మంది ఉన్నారు. ఇద్దరు బదిలీతో ఆ సంఖ్య 28కి చేరింది. మరో 18 పోస్టులు ఖాళీగా ఉంటాయి. ఇప్పటికే జస్టిస్ చిల్లకూరు సుమలత, జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్‌ను బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. వీరి బదిలీల ఫైల్ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది.

ప్లకార్డులు పట్టుకొన్నారని ఎంపీలపై ఫిర్యాదు

- ప్రివిలేజ్ కమిటీకి రాజ్యసభ చైర్మన్ సిఫారసు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: దేశంలో స్వతంత్రంగా భావాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ పౌరులకే కాదు.. భారత ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి పార్లమెంటులో ఎంపీలకు కూడా లేకుండా పోతున్నది. ఏమన్నా అంటే సస్పెండ్, లేదంటే నిండు సభలో అంతు చూస్తామంటూ అధికార పార్టీ సభ్యుల బరితెగింపు హూంకరింపులు. ఇలాంటి దృశ్యాలు ఈ మధ్య పరిపాటి అయిపోయాయి. తాజాగా రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారని బీఆర్ఎస్ ఎంపీలపై అధికార బీజేపీ ఎంపీ ఒకరు సభా చైర్మన్ ధన్‌కడ్‌కు ఫిర్యాదు చేయటం, ఆయన వెంటనే ప్రివిలేజ్ కమిటీకి సిఫారసు చేయటం చకచకా జరిగిపోయాయి. గత నెల 18 పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావుతోపాటు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, బీ లింగయ్య యాదవ్ పలు సమస్యలపై రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ చర్య మహా పాపం అన్నట్టుగా బీజేపీ ఎంపీ వివేక్ ఠాకూర్ సభాధ్యక్షుడు జగ్‌దీప్ ధన్‌కడ్‌కు ఫిర్యాదు చేశారు. రూల్ 188 కింద నోటీస్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించటం వల్ల సభా కార్యకలాపాలకు భంగం కలిగిందని, వారు సభా నియమాలను ఉల్లంఘించారని ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ధన్‌కడ్.. రాజ్యసభ కాండక్ట్ ఆఫ్ బిజినెస్ రూల్ 203 కింద ప్రివిలేజ్ కమిటీకి సిఫారసు చేస్తూ.. ఆ నోటీసును పరిశీలించి, విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సభలో నోరెత్తకూడదా?

దేశంలో ఏ మూలన ప్రజలకు ఏ సమస్య వచ్చినా పార్లమెంటు ఉభయ సభల్లో ఏ సభ్యుడైనా దాన్ని లేవనెత్తేందుకు హక్కు ఉన్నది. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపేందుకు ప్రతిపక్ష సభ్యులు సభలో అనేక మార్గాల్లో నిరసనలు తెలుపుతారు. గతంలో ప్రతిపక్షాలు సెషన్లకు సెషన్లనే ఎలాంటి చర్చలు జరుగకుండా అడ్డుకొన్న సందర్భాలున్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ పార్లమెంటులో అరాచకంగా వ్యవహరించిన రికార్డులు భద్రంగా ఉన్నాయి. సభ్యులు సభలో ఎలా నడుచుకోవాలనే దానిపై లోక్‌సభ, రాజ్యసభలకు ప్రత్యేక నియమావళులు ఉన్నాయి. వాటిని అతిక్రమిస్తే సభాధ్యక్షులు సదరు సభ్యులపై చర్యలు తీసుకోవచ్చు. బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ రూల్స్‌ను ఏనాడూ పాటించలేదు. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ పార్టీకి రూల్స్ గుర్తుకు వచ్చాయని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇక ఈ ఫిర్యాదు విషయానికి వస్తే.. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావుకు పార్లమెంటు సభ్యుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్నది. పార్టీలకతీతంగా ఆయనను పార్లమెంటులో అందరూ గౌరవిస్తారు. ఆయన పదవీకాలంలో నియమాలను ఉల్లంఘించిన చరిత్ర కూడా లేదు. బీజేపీ సభ్యుడు కేకేపై ఫిర్యాదు చేయటంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతున్నది. తెలంగాణలో ఎన్నికలవేళ బీఆర్ఎస్‌ను బెదిరించాలన్న ప్రయత్నాల్లో భాగంగానే బీజేపీ ఇలాంటి ఎత్తులు వేస్తుండవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ప్రవళిక ఆత్మహత్య అనంతర ఘటనపై కేసులు

- పోలీసులపై దాడి, విధులకు ఆటంకం కలిగించిన వారిపై నమోదు
- నిందితుల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు.. త్వరలో నోటీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రవళిక ఆత్మహత్య ఘటనను తప్పుదోవ పట్టిస్తూ పోలీసులపై దాడి, వారి విధులకు ఆటంకం కలిగించిన వారిపై చిక్కడపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు. గత శుక్రవారం రాత్రి ప్రవళిక ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలియగానే విద్యార్థి సంఘాల, కొన్ని పార్టీల నాయకులు హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ, రాళ్లు రువ్వుతూ పోలీసులను గాయపర్చారు. ఈ నేపథ్యంలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వైకే ప్రసాద్, సైఫాబాద్ ఎస్సై తరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదులపై శనివారం చిక్కడపల్లి ఠాణాలో రెండు కేసులు నమోదయ్యాయి. కొందరు వ్యూహాత్మకంగా హాస్టల్ వద్దకు వచ్చిన ఆందోళన చేయడం, గ్రూప్-2 పరీక్ష వాయిదా వల్లే ఆత్మహత్య అంటూ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తూ నిరుద్యోగ యువతను రెచ్చగొట్టారని పోలీసులు తెలిపారు. ఆందోళన చేస్తున్న వారిని నిలువరించే ప్రయత్నం చేస్తే తమపైనే తిరగబడ్డారని, దాడులు కూడా చేశారని పోలీసులు తెలిపారు. ఆ రోజు ఆందోళనలో బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు అనిల్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ నాంపల్లి, సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఫిరోజ్‌ఖాన్, నీలి మారెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎం శివాజీ, రాజ్‌కుమార్, రాజు, వినయ్‌కుమార్, గుర్రాల అరుణ్‌కుమార్, శివకృష్ణ, విద్యార్థి సంఘం నాయకులు జే సురేశ్, జీవన్, ఈశ్వర్, నాగేందర్, సురేశ్, అక్షయ్, రిజ్వాన్, కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అశోక్‌తోపాటు కొందరు విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐపీసీ 153, 341, 143, 353 రెడ్‌విత్ 149, సిటీ పోలీస్ యాక్ట్ కేసులు, మరో ఘటనపై 143, 148, 341, 332 రెడ్‌విత్ ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆయా నేరాలపై సాక్ష్యాలను సేకరించి, నిందితులకు నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

తిరుమల దర్శనం టికెట్ల నమోదు షురూ!

నీట్ ఎస్ఎస్‌లో నిమ్స్ జయకేతనం

- డాక్టర్ సుబ్రమణియన్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు
- మరో 11మందికి టాప్‌ర్యాంకులు
- అభినందించిన డైరెక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటిబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) ఖైరతాబాద్ : నిమ్స్ జనరల్ మెడిసిన్ వైద్యులు తెలంగాణ కీర్తిని చాటారు. నీట్ ఎస్ఎస్-2023 ఎంట్రెన్స్ పరీక్షల్లో ఆలిండియా తొలి ర్యాంకుతో పాటు మరిన్ని అత్యుత్తమ ర్యాంకులను కైవసం చేసుకొని జయకేతనం ఎగురవేశారు. నిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు డాక్టర్ సుబ్రమణియన్ ఆలిండియా మొదటి ర్యాంకు సాధించారు. ఆయనతో పాటు శరత్‌చంద్ర గౌడ్ 15, అభిషేక్ 32, నవీన్ కుమార్ 35, భాను 49, కీర్తి 58, అభిలాశ్ 356, ఖలీల్ 559, సుగుణ 656, నందిత 796, జాకీర్ 870, దినేశ్ 1199 ర్యాంకులతో అదరగొట్టారు. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన చర్మవ్యాధుల వైద్యనిపుణుడు డాక్టర్ ప్రభాకర్‌రావు, మణి దంపతుల కుమారుడైన సుబ్రమణియన్ తొలి ర్యాంకు సాధించి రాష్ట్ర కీర్తిని దేశానికి చాటి చెప్పారు.

నిమ్స్ డైరెక్టర్ అభినందనలు

ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు మరో 11 అత్యుత్తమ ర్యాంకులు సాధించిన నిమ్స్ వైద్యులను డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అభినందించారు. బుధవారం నిమ్స్‌లో వారిని సత్కరించారు. కార్యక్రమంలో డీన్ లీజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నావల్ చంద్ర, ప్రొఫెసర్ రాజు, ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ శెట్టి, డాక్టర్ స్వరూప పాల్గొన్నారు.

నీట్ ఎస్ఎస్-2023 ఎంట్రెన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన నిమ్స్ వైద్యులు

నిమ్స్‌కు రుణపడి ఉంటా

> నిమ్స్ దేశంలోనే ఒక అత్యుత్తమ సంస్థ. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉన్నారు. సర్వీస్‌లోనూ, టీచింగ్‌లోనూ మెడికల్ విద్యార్థులకు అన్ని విధాలా సహకరిస్తారు. అన్నిరకాల రోగులు రావడం వల్ల ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా పెరుగుతుంది. ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు చాలా సంతోషంగా ఉన్నది. నేను కష్టపడి చదివినా మంచి శిక్షణ ఇచ్చిన నిమ్స్‌కు రుణపడి ఉంటా. ఇక ఎండోక్రనాలజి విభాగంలో సూపర్‌స్పెషాలిటీ చేయాలనుకొంటున్నాను. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తాను. - డాక్టర్ సుబ్రమణియన్ (ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ విద్యార్థి)

ఓఆర్ఆర్ వివాదంలో హెచ్ ఎండీఏకు కొంత ఊరట

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగ్‌రోడ్ కాంట్రాక్ట్ వివాదంపై హెచ్ఎండీఏకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కాంట్రాక్టర్ సైబరాబాద్ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌కు రూ.360 కోట్లకు 12 శాతం వడ్డీతో